పార్టీ రాష్ట్రకమిటీ సమావేశం ఆగష్టు 19,20 తేదీలలో విజయవాడ, యం.బి.విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశానికి పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, యం.ఏ.బేబి లు హాజరయ్యారు. సమావేశం ఈ క్రింది తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం/ ప్రసారార్థం పంపుతున్నాము. – జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

# తీర్మానం

# పోలవరం మునక బాధితుల్ని ఆదుకోవాలి.

# సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్

గోదావరి వరద బాధిత ప్రజల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. గోదావరికి తిరిగి వరదలొస్తున్నాయి. జూలై 11న వచ్చిన వరదల నుండి ప్రజలు ఇంత వరకు కోలుకోలేదు. ఇప్పటికీ నీళ్ళలోనే గ్రామాలు మునిగి ఉన్నాయి. ప్రభుత్వ సహాయం అరకొరగా వుంది. వరద బాధితుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. పోలవరం నిర్మాణంలో అవకతవకలు వల్ల మునక పెరిగి ప్రజల బాధలు పెరిగాయి. కేంద్రం బృందాలను పంపి బాధితుల్ని ఆదుకోడానికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం నిందించుకుంటూ పోలవరం ముంపు బాధితులకు పునరావాసం కల్పించకుండా నిలువునా ముంచేస్తున్నారు. కేంద్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నది.

గోదావరి వరద బాధిత ప్రాంతాలలో గత నెల పైగా కాలంలో సిపిఐ(యం) కమిటీలు, కార్యకర్తలు వరద బాధితులకు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గోదావరి వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పూర్తి న్యాయం జరిగే వరకు సిపిఐ(యం) పూర్తిగా అండదండలను అందిస్తుందని రాష్ట్ర కమిటీ సమావేశం హామీ ఇస్తోంది.

పోలవరం ప్రాజెక్టు కింద మొత్తం 8 మండలాల్లోని 222 పంచాయితీల్లో 373 గ్రామాలు సంపూర్ణంగా మునుగుతాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఈ మొత్తం గ్రామాల్లో 1,06,006 కుటుంబాలు నిర్వాసితులుగా తేల్చారు. ఇది చాలా కాలంగా చెబుతున్న లెక్క. కానీ వాస్తవంలో దాదాపు మరో 100 గ్రామాలు పైనే మునుగుతాయి. అని ఇటీవల వచ్చిన వరద రుజువు చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల విన్నపాలను పట్టించుకోకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రభుత్వం 45వ కాంటూరులో చేర్చిన గ్రామాలు, అసలు ముంపు జాబితాలో లేని గ్రామాలు కూడా 2019 నుండి వచ్చిన వరదలలో ఈ గ్రామాలన్నీ మునిగిపోయాయి. 6విలీన మండలాల్లోని గ్రామాలలో కాంటూరు లెక్కలు తప్పులతడకగా ఉన్నాయి. పునరావాసం, పునరావాస ప్యాకేజి పూర్తిగా అమలు జరిపేంతవరకు ఎలాంటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టవద్దని ప్రజలు, నిపుణులు, న్యాయస్థానాలు తీర్పులు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశంగా, చట్టవిరుద్ధంగా నిర్మాణం చేపట్టాయి. పునరావాసానికి కేంద్రం నిధులు ఇవ్వకుండా తమ బాధ్యత నుండి తప్పించుకొంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నిధుల గురించి పోరాడకుండా ఏజెన్సీ ప్రజలను ముంచేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వవలసిన ప్యాకేజి తమకు సంబంధం లేదని చట్టవిరుద్ధంగా, అన్యాయంగా మాట్లాడుతోంది. ఇటీవల వరద పర్యటనలో ముఖ్యమంత్రి 41.15 కాంటూరు వరకు మాత్రమే పునరావాసం పూర్తిచేస్తామని ప్రకటించారు. అంటే మిగిలిన గ్రామాలను గాలికి వదిలేస్తారా అని ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. వరద బాధిత మండలాల్లో ప్రజలను ఆదుకునేందుకు ఎటువంటి సహాయ సహకారాలను ప్రకటించలేదు. ఇది చాలా అన్యాయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్యాయ, అమానుష వైఖరికి 3 లక్షల నిర్వాసిత ప్రజలు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం నానా అగచాట్లు పడుతున్నారు. ఇందులో ఆదివాసీలు అత్యధికంగా ఉన్నారు.

పోలవరం ప్రాజెక్టు, వరద బాధిత మండలాల్లోని ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా సహాయం అందించాలి. క్రింది డిమాండ్లు సత్వరం అమలు జరిపి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను, గోదావరి లంక గ్రామాల ప్రజలను ఆదుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేస్తున్నది.

**డిమాండ్లు :**

(1) కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 6 విలీన మండలాల్లో, పోలవరం, దేవీపట్నం మండలాల్లో 2013 భూసేకరణ చట్టం, పూర్తి స్థాయి ప్యాకేజి అమలు జరిపి పునరావాసం కల్పించాలి.

(2) పూర్తి పునరావాసం కల్పించేలోపు ప్రతి కుటుంబానికి వరద బాధిత సహాయం అందించాలి. ప్రతి కుటుంబానికి నెలకు 25 కేజీల బియ్యం, కందిపప్పు, నిత్యావసర వస్తువులు, మంచినూనె, కిరోసిన్ వగైరా ఇవ్వాలి. కుటుంబ ఖర్చుల నిమిత్తం నెలకు 5 వేల రూపాయలు ఇవ్వాలి.

(3) రహదారులకు మరమ్మత్తులు చేయాలి. విద్యుత్ తక్షణం పునరుద్ధరించాలి.

(3) వరద నష్టం వెంటనే ఎన్యూమరేషన్ చేయాలి. పూర్తిగా నష్టపోయిన ఇంటికి 6 లక్షలు, పాక్షికంగా నష్టపోయిన ఇంటికి 1 లక్ష మంజూరు చేయాలి.

(4) తాత్కాలికంగా గుడారాలు, షెడ్లు నిర్మాణానికి సామాగ్రి ఇవ్వాలి. ప్రతి కుటుంబానికి టార్పాలిన్లు, దోమ తెరలు ఇవ్వాలి.

(5) అన్ని గ్రామాల్లో సత్వరం పారిశుద్ధ్యం నిర్వహించాలి.

(6) సంచార వైద్యశాలలు, వైద్య శిబిరాలు నిర్వహించాలి.

(7) పంటలు, పశువులు నష్టం ఎన్యూమరేషన్ చేసి నష్టపరిహారం ఇవ్వాలి. పశుగ్రాసం సరఫరా చేయాలి.

(8) ప్రతి ముంపు గ్రామానికి, లంక గ్రామాలకు రక్షిత మంచినీరు సరఫరా చేయాలి.

= = = =